ఆర్ట్స్ కాలేజ్‌లో కేసీఆర్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వినయ్ భాస్కర్

క్రీడాకారులకు అండగా ఉంటా..

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 14 : నాలుగేళ్లుగా కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో బుధవారం కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో 26 జట్లు పాల్గొంటున్నాయన్నారు. కుడా మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ బాధ్యుడు ఫారుక్ పాల్గొన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : ఆర్డీవో

నల్లబెల్లి, ఫిబ్రవరి 14: మద్ది మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు తరలివచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డీవో కృష్ణవేణి తెలిపారు. నాగరాజుపల్లె శివారులో జరుగనున్న మద్దిమేడారం జాతర పనులను బుధవారం పరిశీలించారు. నీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్, పోలీస్ బందోబస్తు, రోడ్డు మార్గం పునరుద్ధరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, కట్టయ్య, పీఆర్ ఏఈ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవిత్ర, విద్యుత్ ఏఈ పెద్ది రవళి, ఎంపీవో ప్రకాశ్, ఎండోమెంట్ అధికారి భిక్షమాచారి, ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్, ఎస్సై నగేశ్ పాల్గొన్నారు.

ముగ్గురు ఏసీపీలు బదిలీ

సుబేదారి, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం 95మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఏసీపీలు బదిలీ అయ్యారు. మూడు రోజుల క్రితం మామునూరు నుంచి డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయిన సతీశ్‌బాబు మళ్లీ మామునూరుకే బదిలీ కాగా, నర్సంపేట నుంచి వరంగల్ ట్రాఫిక్‌కు బదిలీ అయిన ఏసీపీ తిరుమల్ తాజాగా కాజీపేటకు బదిలీ అయ్యారు. వరంగల్ కమిషనరేట్ ఎస్‌బీకి అటాచ్డ్‌గా ఉన్న ఏసీపీ రమేశ్‌కుమార్ చిక్కడపల్లికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న భీమ్ శర్మ వరంగల్ కమిషనరేట్ ఎస్‌బీకి బదిలీ అయ్యారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు శ్రీ రమేష్ చెట్టుపల్లి, తండ్రి: రాజేశ్వర్ రావు, వయస్సు: 45 సం.లు, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఇ.నెం. 2-95, పానకల్ గ్రామం, నాచినపల్లి పోస్టు, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా గారికి చెందిన భూమి రిజిస్టర్ డాక్యుమెంటు నెం. 187/2022, తేది: 21-01-2022 ప్లాటు నెం. 10&11, సర్వే నెం. 134 (పాత), 134/1, విస్తీర్ణం: 550 చ.గ.లు లేదా 459.85 చ.మీ.లకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్సు ఓరిజినల్ దస్తావేజు నెం. 77/2011, తేది: 26-06-2011, 7732/2012, తేది: 16-10-2012 మరియు 8929/2012, తేది: 04-12-2012 బాపతువి, తేది: 13-10-2023 రోజున ఏనుమాముల మార్కెట్‌కు పత్తి అమ్ముటకు వెళ్లి బయటకు వచ్చి నా వాహనంలో చూడగా పై డాక్యుమెంట్లు పోయినవి. ఈ విషయమై సంబంధిత పోలీసు స్టేషన్‌లో పై లింక్ డాక్యుమెంట్లు పోయినట్లు ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసు వారు మాకు సర్టిఫికెట్ నెం. 15201310231741469440, తేది: 25-12-2023 రోజున జారీ చేసినారు.

ఇట్టి దస్తావేజులు ఎవరికైనా దొరికినచో దయచేసి వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

నా క్లయింటు యొక్క కోరికపై ఇట్టి ప్రకటన జారీ చేయడమైనది.

ఇట్లు: **నీల శ్రీధర్ రావు,** న్యాయవాది,
ఇ.నెం. 10-10-107, చార్‌బౌలి లేన్, గిర్మాజీపేట,
వరంగల్ సిటీ & జిల్లా. సెల్: 8686100402.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

- సమస్య ఉన్న గ్రామాలను ముందే గుర్తించాలి
- బోర్లకు మరమ్మతులు చేపట్టాలి
- తాగునీరు వృథా కాకుండా అవగాహన కల్పించాలి
- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్, ఫిబ్రవరి 14: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె మిషన్ భగీరథ ఇంట్రాగ్రిడ్, పంచాయతీ అధికారులతో వరంగల్ జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. పాలేరు నుంచి రాయపర్తి, నర్సంపేట మండలాలకు, ధర్మసాగర్ నుంచి పర్వతగిరి, వర్ధన్నపేట మండలాలు, పరకాల నియోజకవర్గంలోని సంగెం, గీసుకొండ మండలాలకు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళికాబద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. అన్ని గ్రామా ల్లో వెంటనే బోర్లు, చేతిపంపులకు మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. తాగునీరు వృథా కాకుండా గ్రామాల్లో ఎంపీవోలు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీవో కల్పన, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, ఈఈ వెంకటరామిరెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 14 : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేస్తే విజయం తథ్యమని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం జులైవాడ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఎదగాలంటే విద్యార్థి దశ ప్రధానమని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సఖీ వన్ స్టాప్ కేంద్రం లీగల్ అడ్వైజర్ శ్రీదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, కేస్ వర్కర్ వినీల, వార్డెన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

56 లీటర్ల గుడుంబా పట్టివేత

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 : పెద్దాపురం గ్రామానికి చెందిన వేల్పుల గణేశ్ గుడుంబా విక్రయిస్తుండగా, బుధవారం రాత్రి పోలీసులు దాడి చేసి 56లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు. ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక

దామెర, ఫిబ్రవరి 14 : మండలంలోని ఓగులాపురం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల (సంగెం) విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ యాదగిరి బుధవారం తెలిపారు. గణేశ్, విద్యాకర్, గణేశ్ ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో జరుగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీనాథ్, జగన్ అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీలు

నర్సంపేట, ఫిబ్రవరి 14: నర్సంపేట, వర్ధన్నపేట ఏసీపీలు కిరణ్‌కుమార్, ఎ.నర్సయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌కుమార్ హనుమకొండ నుంచి బదిలీపై వచ్చారు. ఆయనను సీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, వర్ధన్నపేటలో ఏసీపీ నర్సయ్యకు సీఐ సూర్యప్రకాశ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆలయ దశమ వార్షికోత్సవం

ఐనవోలు, ఫిబ్రవరి 14: ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలోని భ్రమరాంబికాదేవి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునుంచే గణపతి పూజ పుణ్యాహవాచనం, అమ్మ వారికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి, చండీహవనం నిర్వహించారు. పలువురు భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు-వసంత దంపతులు, ఉప ప్రధాన అర్చకుడు రవీందర్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

కరీమాబాద్, ఫిబ్రవరి 14: బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కరీమాబాద్‌లో బుధవారం కనులపండువగా నిర్వహించారు. స్థానికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి దేవతామూర్తులను దర్శించున్నారు. రంగశాయిపేటలో సైతం చేపట్టిన బొడ్రాయి ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా జరిగింది. సచ్చిదానంద స్వామి పూజలు నిర్వహించారు.

అమృత్ మిత్రలో భాగస్వామ్యం చేయాలి

బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధికా గుప్తా

మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ రాధికా గుప్తా

వరంగల్, ఫిబ్రవరి 14 : అమృత్‌మిత్ర పథకంలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమృత్ మిత్ర 2.0 పథకం అమలు చేస్తున్నదన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలకు ఎఫ్ఎస్‌టీపీ, ఎస్‌టీపీలు, పార్కుల నిర్వహణ అప్పగించాలని సూచించారు. నీటి శాంపిల్స్ సేకరణ, నాణ్యత పరిశీలన, లీకేజీలను గుర్తించే బాధ్యతలు అప్పగించాలన్నారు. సమావేశంలో బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి, హెచ్‌వో రమేశ్, టౌన్ ప్రాజెక్ట్ అధికారి కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, ఈఈ రాజయ్య, డీఎంసీ రజితారాణి, రేణుక, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవోలు

గీసుగొండ, ఫిబ్రవరి 14 : గీసుగొండ ఎంపీడీవోగా కృష్ణవేణి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో వీరేశం హనుమకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి ఎంపీడీవో కృష్ణవేణి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎంపీవో ప్రభాకర్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఖానాపురం/చెన్నారావుపేట : ఎంపీడీవోగా భారతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సుమనావాణి ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. చెన్నారావుపేట నుంచి భారతి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే, చెన్నారావుపేట ఎంపీడీవోగా గోవిందరావు బాధ్యతలు స్వీకరించారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం ప్రవేశాలకు దరఖాస్తులు

ఖిలా వరంగల్, ఫిబ్రవరి 14: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద జిల్లాలోని అర్హత కలిగిన ప్రైవేటు పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పీ భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఒకటో తరగతి, రెసిడెన్షియల్ కోసం ఐదో తరగతిలో చేరేందుకు ఈ నెల 28లోగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వసంత పంచమి వేడుకలు

గిర్మాజీపేట/పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా బుధవారం పలు చోట్ల ఘనంగా వేడుకలు జరిగాయి. వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోనబోయిన సతీశ్ సరస్వతీ అమ్మ వారికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ఆకారపు వారి గుడిలో అర్చకుడు లంకా శివకుమార్‌శర్మ అమ్మ వారిని సరస్వతీదేవిగా అలంకరించి చిన్నారులకు పలక, బలపాలు అందించారు. అలాగే, వరంగల్ శ్రీనివాస కాలనీలోని శృంగేరి శంకరమఠంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. శారదాంబ అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని శారదాంబ సన్నిధానంలో వందలాది మంది చిన్నారులకు అక్షరపూజ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి పాల్గొన్నారు.

నిట్‌లో..

హనుమకొండ చౌరస్తా : వరంగల్ నిట్‌లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజా కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరయ్యారు. విద్యార్థులకు రంగోలి, ఉద్యోగుల పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సాయంత్రం మహా హారతి నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కుటుంబ సమేతంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు.

స్మృతి ఆర్గానిక్ లిమిటెడ్ ప్రతినిధిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సైకిళ్ల పంపిణీ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14: మండలంలోని ఇల్లంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 18 మంది పేద విద్యార్థులకు పూర్వ విద్యార్థి, స్మృతి ఆర్గానిక్ లిమిటెడ్ ప్రతినిధి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ కుమారుడు, సంస్థ జాయింట్ డైరెక్టర్ ఈగ పురుషోత్తం మాట్లాడుతూ పుట్టిన గ్రామం, చదువుకున్న పాఠశాలకు సేవలందించాలనే లక్ష్యంతో తన తండ్రి సూచనల మేరకు పాఠశాలలో సైకిళ్లతో పాటు కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌ను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ, కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సీఐ చేయూత

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో ఉన్న ఓ మహిళకు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి చేయూతనిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. హంటర్‌రోడ్డులోని గ్రీన్‌వుడ్ స్కూల్ సమీపంలో హనుమకొండకు చెందిన దంపతులు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో బైక్ పైనుంచి పడిన సరోజనకు తీవ్ర గాయాలు కావడంతో రోడ్డుపై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. 108 వాహనం సకాలంలో చేరుకోలేకపోవడంతో పెట్రోలింగ్‌లో ఉన్న మట్టెవాడ సీఐ తుమ్మ గోపి గమనించి ఆమెను ఎత్తుకొని తన వాహనంలో ఎక్కించి ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందించారు. సకాలంలో స్పందించి ఆమె ప్రాణాలను కాపాడిన సీఐ గోపికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 14 : ఈ నెల 16న జరిగే రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఆటోడ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపల్లి సంజీవ్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని, జీవనోపాధి చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6.50 లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌లో తీసుకున్న ఆటోడ్రైవర్లు కిస్తీలు కట్టలేక, కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆటోడ్రైవర్లకు జీవనోపాధి కింద ప్రతి నెలా రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకతీయ ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సిద్ధి సదానందం, జన్ను అనిల్, తండా సదానందం, పోగుల అనిల్, చుంచు ప్రవీణ్, చక్రపాణి, సాయిలు, గుండా రమేశ్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ సర్కార్

వరంగల్ చౌరస్తా/పోచమ్మమైదాన్ : మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త బంద్, కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్, గవిచెర్ల క్రాస్‌రోడ్డు వద్ద కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు. అలాగే, 16న ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పోచమ్మమైదాన్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి పోచమ్మమైదాన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్ల రమేశ్, జన్ను ప్రకాశ్, గన్నారపు రమేశ్, గంగుల దయాకర్, పాశ రవియాదవ్, యాకూబ్, ఖాసీం, లింగమూర్తి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్

జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హైదరాబాద్‌కు తరలిన ట్రైనీ కానిస్టేబుళ్లు

సుబేదారి, ఫిబ్రవరి 14 : పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన ట్రైనీ కానిస్టేబుళ్లు నియామక పత్రాలను అందుకోవడానికి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. బుధవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ ఎదుట సీపీ అంబర్ కిశోర్ ఝా, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషరేట్ నుంచి వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు చెందిన 982 మంది అభ్యర్థులు సివిల్, ఏఆర్, స్పెషల్, ఎక్సైజ్, జైలు వార్డర్స్, ఐటీ కమ్యూనికేషన్ విభాగాల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైనవారు వారి కుటుంబాలకు అండగా ఉంటూ, ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు డీసీపీ సంజీవ, ఏసీపీలు సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐలు స్పర్జన్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏసీపీ దేవేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

సుబేదారి, ఫిబ్రవరి 14 : హనుమకొండ ఏసీపీ కే దేవేందర్‌రెడ్డి విధుల్లో చేరారు. బుధవారం హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌస్ రోడ్డులోని ఏసీపీ కార్యాయంలో దేవేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీపీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 14 : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ముల్కనూరులో నాబార్డు సహకారంతో స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మహిళలను అభివృద్ధి పథంలో నడిపించాలనే దృక్పథంతో 30మందికి మగ్గం శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాల కోసం బ్యాంకులను సంప్రదిస్తే రుణాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నాగరాజు, స్పందన సేవా సొసైటీ అధ్యక్షురాలు శోభారాణి పాల్గొన్నారు.

'అగ్రంపహాడ్'లో భక్తుల ముందస్తు మొక్కులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 : అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరలో బుధవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తులు పసుపు, కుంకుమ, నిలువెత్తు బెల్లం, ఒడి బియ్యం సమర్పించారు. కాగా, జాతర అభివృద్ధి పనులను పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, ఎండోమెంట్ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ఆర్ సంతోష్, ఎండోమెంట్ అధికారి శేషగిరి, జూనియర్ అసిస్టెంట్ గోపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 : కటాక్షపురం గ్రామ శివారులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారం రోజుల క్రితం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు సమాచారం. బుధవారం గ్రామస్తులు ఆలయానికి వెళ్లి చూడగా, తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు కనబడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

నడికూడ, ఫిబ్రవరి 14 : కారు బైక్‌ను ఢీకొట్టడంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన భార్యాభర్తలు బొల్లం రాజు (48), సరిత (44) పరకాలకు వెళ్తున్నారు. భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి హనుమకొండకు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీ కొట్టగా, దంపతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు చికిత్స కోసం తరలించారు. విషయం తెలుసుకున్న పరకాల ఎస్సై శివకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

బంగారం, నగదు చోరీ

పరకాల, ఫిబ్రవరి 14 : తాళం వేసి ఉన్న ఇంట్లో నగదుతో పాటు బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన పట్టణంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సగరవీధికి చెందిన అనంతుల ఉమామహేశ్వర్ కొన్నాళ్లుగా హనుమకొండలో ఉంటున్నాడు. కాగా, మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు ఉమామహేశ్వర్‌కు సమాచారం అందించారు. అతడు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, రూ. 20వేల నగదుతో పాటు రూ.4.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించగా, సీఐ అబ్బయ్యతో పాటు క్లూస్ సీఐ శ్రీధర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పరకాల మున్సిపల్ కమిషనర్‌గా నర్సింహ